# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం 26 ఏప్రిల్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## వక్ఫ్ (సవరణ) చట్టంపై పిటిషన్లను కొట్టివేయండి

- సుప్రీంకోర్టులో కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేసిన కేంద్రం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



వివాదాస్పద వక్ఫ్ సవరణ చట్టం 2025ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌లు కొట్టివేయాలని కేంద్రం సుప్రీంకోర్టులో కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేసింది. చెల్లుబాటు అయ్యేలా పార్లమెంటు ఆమోదించిన చట్టంపై స్టే విధించలేరని అఫిడవిట్‌లో పేర్కొంది. వివాదాస్పద చట్టాన్ని సమర్థిస్తూ కేంద్రం 1,1332 పేజీల కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేసింది. మైనారిటీ వ్యవహారాల శాఖ జాయింట్ సెక్రటరీ ఈ అఫిడవిట్‌ను దాఖలు చేశారు. 2013 తర్వాత ఆశ్చర్యకరంగా 20 లక్షల హెక్టార్లకు పైగా (కచ్చితంగా 20,92,072.536) వక్ఫ్ భూమి అదనంగా పెరిగిందని అఫిడవిట్‌లో పేర్కొంది. చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లు.. సవరణలు మత స్వేచ్ఛ ప్రాథమిక హక్కులను హరిస్తాయనే తప్పుడు ప్రాతిపదికన కొనసాగాయని పేర్కొంది.

# ఉగ్రవాదుల భరతం పడదాం

- పహల్గాం ముష్కర దాడి హేయమైనది
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునే విషయంలో కేంద్రానికి అండగా నిలుస్తాం
- ఇది రాజకీయాలకు అతీతంగా ఐకమత్యం చాటుకోవాల్సిన సందర్భం
- సీఎం రేవంత్‌రెడ్డి
- హైదరాబాద్‌లో కొవ్వొత్తుల ర్యాలీ



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

పార్టీలు, సిద్ధాంతాలకతీతంగా ఉగ్రవాదంపై పోరు జరపాలని, ఉగ్రవాదుల భరతం పడదామని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ శుక్రవారం హైదరాబాద్‌లో పీపుల్స్ ప్లాజా నుంచి నెక్లెస్ రోడ్ ఇందిరా విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. దీనిలో సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, భారత్ సమ్మిట్‌కు వచ్చిన విదేశీ ప్రతినిధులు, మంత్రులు డి శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ఎంపీ మల్లు రవి తదితరులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో నగరవాసులు పాల్గొని పహల్గాం మృతులకు సంతాపం తెలిపారు.

హైదరాబాద్ పీవీ మార్గ్ (నెక్లెస్ రోడ్డు)లోని పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరా గాంధీ విగ్రహం వరకు సాగిన కొవ్వొత్తుల ర్యాలీలో ముఖ్యమంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క , మంత్రివర్గ సహచరులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, భారత్ సమ్మిట్ లో పాల్గొనడానికి వచ్చిన వివిధ దేశాల ప్రతినిధులు, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సంఘీభావ ర్యాలీని ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ, పహల్గామ్‌లో అమాయకుల ప్రాణాలను తీసిన ఉగ్రవాదుల చర్యలను తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనకు బాధ్యులైనవారిపై కఠినంగా చర్యలు తీసుకునే విషయంలో యావత్ దేశం కేంద్ర ప్రభుత్వానికి అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.

"ఈ భావోద్వేగ సమయంలో 140 కోట్ల మంది భారత ప్రజలంతా ఒక్కటిగా నిలబడాలి. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవాలి. ఇది రాజకీయాలకు అతీతంగా ఐకమత్యం చాటుకోవాల్సిన సందర్భం. దాడికి బాధ్యులైన వారిని ఉపేక్షించకూడదు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ విషయంలో భారత ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నాము. 1967లో చైనాపై, 1971లో పాకిస్తాన్‌పై నాటి ప్రధాని ఇందిరా గాంధీ నాయకత్వంలో మన దేశం చూపిన తెగువను గుర్తు చేస్తున్నాను. ఇందిరా గాంధీ గారి స్ఫూర్తితో ఉగ్రవాదులకు గట్టిగా బుద్ధి చెప్పాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారికి విజ్ఞప్తి చేస్తున్నాను. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను భారత్‌లో కలపే విషయంలోనూ ప్రధానమంత్రి గారికి మద్దతు ఇస్తాం. అలాగే, ఉగ్రదాడి బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తామని భరోసా ఇస్తున్నాం" అని ముఖ్యమంత్రి అన్నారు.

## భారత్ సమ్మిట్ చారిత్రాత్మకమైనది

- రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి
- విదేశీ ప్రతినిధులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- హెచ్ఐసీసీలో ప్రారంభమైన భారత్ సమ్మిట్
- మొదటి రోజు నాలుగు అంశాలపై చర్చ
- పహల్గాం దాడి నేపథ్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు రద్దు
- భారత్ సమ్మిట్‌లో నేడు టెర్రరిజానికి వ్యతిరేకంగా తీర్మానం



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న భారత్ సమ్మిట్ చారిత్మాకమైనదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కాంగ్రెస్ మూల సిద్ధాంతాలతో భారత్ సమ్మిట్ ను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. భారత్ సమ్మిట్ లో గ్లోబల్ జస్టిస్ కోసం ప్రపంచ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారన్నారు. హెచ్ఐసీసీ వేదికగా తొలిరోజు జరిగిన భారత్ సమ్మిట్ గురించి మల్లు భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు.

'గ్లోబల్ జస్టిస్ కోసం ప్రపంచ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. సోషల్ జస్టిస్, శాంతి తదితర అంశాలపై సమ్మిట్ లో చర్చించారు. సామాజిక న్యాయం, అభివృద్ధిపై డెలిగేట్స్ తో చర్చించాం. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల పట్ల విదేశీ ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ న్యాయ్ కార్యక్రమం పట్ల డెలిగేట్స్ హర్షం వ్యక్తం చేశారు. ఉగ్రవాదుల దాడికి నిరసనలో విదేశీ ప్రతినిధులు పాల్గొంటామన్నారు. కశ్మీర్ ఉగ్రవాద దాడిపై దేశ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి.నెక్లెస్ రోడ్డులో జరిగే కొవ్వొత్తుల ర్యాలీలో విదేశీ ప్రతినిధులు పాల్గొంటారు' అని తెలిపారు.

భారత్ సమ్మిట్‌లో ప్రధానంగా తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలంటూ విదేశీ ప్రతినిధులను కోరినట్లు డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన భారత్ సమ్మిట్‌లో అహింస, సత్యం, సామాజిక న్యాయం ఎజెండాగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ మౌలిక సిద్ధాంతాలను అంగీకరించే ప్రజాస్వామిక వాదులు, ప్రగతిశీల వాదులు ఈ సమ్మిట్‌కు హాజరైనట్లు తెలిపారు.

భారత్ సమ్మిట్ ప్రభుత్వ కార్యక్రమమా? పార్టీ కార్యక్రమమా? అన్న ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ... కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరుగుతుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ భావజాలాన్నే కాంగ్రెస్ ప్రభుత్వం కలిగి ఉందని తెలిపారు. కార్యక్రమానికి వివిధ దేశాల నుంచి వివిధ రంగాల్లో నిష్ణాతులైన నిపుణులు హాజరయ్యారని చెప్పారు. వారికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సామాజిక న్యాయం, అభివృద్ధి, సంక్షేమ పథకాలను పూర్తిగా వివరించినట్లు తెలిపారు. ఈసందర్భంగా రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతినిధులు అభినందించారని హర్షం

మిగితా 2వ పేజీలో

## సిక్కింలో విరిగిపడిన కొండచరియలు

- భారీగా చిక్కుకున్న పర్యాటకులు..

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



ఉత్తర సిక్కింలోని మున్షితాంగ్ రోడ్లపై భారీ కొండచరియలు విరిగిపడ్డాయి. దాదాపు 1000 మంది పర్యాటకులు ఆయా ప్రాంతాల్లో చిక్కుపోయారు.. మున్షితాంగ్ ప్రాంతంలోని లాచెన్-చుంగ్‌తాంగ్ రోడ్డు, లెమా/బాబ్ వద్ద గురువారం భారీ కొండచరియలు విరిగిపడ్డాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఈ విపత్తు సంభవించింది. గాంగ్టక్ నుండి చుంగ్తాంగ్ వరకూ సుమారు 100 కి.మీ. ప్రాంతంలో నిరంతర వర్షాలు కురుస్తున్నందున పరిస్థితి మరింత దిగజారింది. దీంతో ఆయా ప్రాంతాలకు సందర్శకులకు అనుమతిని రద్దు చేశారు అధికారులు.

కొండచరియలు విరిగిపడిన కారణంగా ప్రభావిత ప్రాంతాల్లో దాదాపు 1,000 మంది పర్యాటకులు చిక్కుకుపోయారని పోలీసు అధికారులు ధృవీకరించారు. కఠినమైన వాతావరణ పరిస్థితులు, కొండచరియలు విరిగిపడటం వల్ల చుంగ్‌థాంగ్‌లో రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. దాదాపు 200 పర్యాటక వాహనాలు చిక్కుకుపోయాయి. దీంతో అధికారులు ప్రయాణికులను సమీపంలోని గురుద్వారాకు తరలించి బస చేసేందుకు ఏర్పాట్లు చేశారు. పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చేవరకూ ఉత్తర సిక్కింకు పర్యాటకులను పంపవద్దని అధికారులు అన్ని టూర్ ఆపరేటర్లను ఆదేశించారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. పరిస్థితులు మెరుగుపడే వరకు సందర్శకులు, స్థానికులు నివాసితులు అప్రమత్తంగా ఉండాలని, అనవసరమైన ప్రయాణాలకు దూరంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

## హైకోర్టులో రేవంత్‌రెడ్డి పిటిషన్

- విచారణకు స్వీకరించిన హైకోర్టు ధర్మాసనం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

గత ఏడాది కొత్తగూడెం బహిరంగ సభలో నిరాధార ఆరోపణలు చేశారని రేవంత్ రెడ్డిపై బీజేపీ క్రిమినల్ పిటిషన్ దాఖలు చేసింది. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారని ఆరోపించారని అందులో పేర్కొంది. దీంతో ఆ పార్టీ పరువుకు నష్టం కలిగిందని పిటిషనర్ కాసం వెంకటేశ్వర్లు తెలిపారు. ఇప్పటికే దీనిపై నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు విచారణ చేపట్టింది. రేవంత్ ప్రసంగించిన ఆడియో, వీడియో సాక్ష్యాలను పిటిషనర్ కోర్టుకు సమర్పించారు. కాసం వెంకటేశ్వర్లు వాంగ్మూలాన్ని ప్రజాప్రతినిధుల కోర్టు నమోదు చేసింది. ఈక్రమంలో ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణలో ఉన్న కేసును కొట్టేయాలని కోరుతూ రేవంత్ రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై నేడు హైకోర్టులో విచారణ జరిగింది. రాజకీయ ప్రసంగాలకు పరువు నష్టం ఉండదని అందులో పేర్కొంటూ పలు సుప్రీంకోర్టు తీర్పులను పిటిషన్‌లో ప్రస్తావించారు. దీనిపై వాదనలు విన్న ఉన్నత న్యాయస్థానం.. తదుపరి విచారణను జూన్ 12వ తేదీకి వాయిదా వేసింది. అలాగే కోర్టు హాజరు నుంచి రేవంత్ ను మినహాయించింది..

## పాకిస్థానీయులు వెళ్లిపోవాలి

- ఈ నెల 30 లోపు వాఘా సరిహద్దు దాటాలి
- డీజీపీ జితేందర్



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణకు వచ్చిన పాకిస్థానీయులకు డీజీపీ జితేందర్ కీలక ఆదేశాలు జారీ చేశారు. పాకిస్థానీయులకు వీసాలను కేంద్రం నిలిపివేసిందని, ఇప్పటికే వీసాలు పొందిన వారికి ఈ నెల 27 వరకు గడువు ఉందని చెప్పారు. హైదరాబాద్‌లో దాదాపు 200 పైచిలుకు పాకిస్తానీలు ఉన్నారని సమాచారం అందడంతో హైఅలర్ట్ ప్రకటించారు. తక్షణమే తెలంగాణలో ఉన్న పాకిస్తానీలు వెంటనే భారత్‌ను వదిలి వెళ్లిపోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 27వ తేదీ తర్వాత వీసాలు రద్దు చేస్తామని, ఆలోపే వెళ్లిపోవాలని ఆదేశించారు. మెడికల్ వీసా దారులకు ఈనెల 29వ తేదీ వరకూ అవకాశం ఇస్తామని, ఆ తర్వాత క్షణం కూడా ఇక్కడ ఉండటానికి వీల్లేదని కఠిన ఆదేశాలు జారీ చేశారు.అక్రమంగా తెలంగాణలో ఉండాలనుకుంటే ఊరుకునేది లేదని.. జల్లెడ పట్టి బయటకు తీసుకొస్తామని హెచ్చరించారు. న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈనెల 30 వరకు అటారి వాఘ బార్డర్ ఓపెన్ ఉంటుంది. హైదరాబాద్‌లో 208 మంది పాకిస్తానీయులు ఉన్నారు. హైదరాబాద్‌లో ఉన్న పాకిస్తానీయులపై నిఘా పెట్టామని తెలిపారు. అంతకుముందు.. పాకిస్తానీయులు 48 గంటల్లో దేశాన్ని వీడాలని కేంద్రం ఆదేశించింది. ఈ మేరకు ఆయా రాష్ట్రాల్లోని ముఖ్యమంత్రులతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడారు.

ఆయా రాష్ట్రాల్లో ఉన్న పాక్ జాతీయులను గుర్తించి వారిని వెనక్కి పంపించే ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. తొలుత స్థానికంగా ఉంటున్న పాకిస్థానీయులను గుర్తించి ఆ సమాచారం కేంద్రానికి పంపించాలని కోరారు. అప్పుడే వారి వీసాల రద్దుకు అవకాశం ఉంటుందన్నారు. గతంలో భారత్ సార్క్ వీసా పొడిగింపు పథకం కింద చాలా మంది పాకిస్తానీయులకు భారత్‌లో పర్యటించే అవకాశాలు కల్పించారు. ఈ ప్రోగ్రామ్ కింద భారత్‌లో ఉన్న ఎవరైనా సరే 48 గంటల్లో దేశాన్ని వీడాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది.

## సోనియా, రాహుల్‌కు నోటీసుల జారీకి కోర్టు నిరాకరణ



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో కాంగ్రెస్ నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీకి నోటీసులు జారీ చేసేందుకు ఢిల్లీ కోర్టు శుక్రవారంనాడు నిరాకరించింది. ఇప్పటికిప్పుడు నోటీసులు ఇవ్వలేమని, ఈడీ సమర్పించిన డాక్యుమెంట్లు సమగ్రంగా ఉన్నాయా లేదా అనేది ముందుకు తాము పరిశీలించాల్సి ఉంటుందని కోర్టు స్పష్టం చేసింది. ఈ కేసులో నిందితులకు నోటీసులు జారీ చేయాలని ఈడీ చేసిన విజ్ఞప్తిపై ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే విచారణ జరిపారు. సవరించిన చట్టంలోని నిబంధల ప్రకారం ఎలాంటి జాప్యం లేకుండానే నోటీసులు జారీ చేయాలని కోర్టును ఈడీ కోరింది. దీనిపై గోగ్నే స్పందిస్తూ, నోటీసు అనివార్యతపై ముందుగా మదింపు చేసుకోవాల్సిన బాధ్యత తమకు ఉందని, నోటీసు అనివార్యత ఉందని కోర్టు సంతృప్తి చెందితే కానీ అలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని పేర్కొన్నారు.

ఈడీ ఫిర్యాదులో కొన్ని లోటుపాట్లు ఉన్నాయని, చార్జిషీటులో చెప్పిన కొన్ని డాక్యుమెంట్లు మిస్సింగ్ అయినట్టు కోర్టు ఆఫీసర్ గుర్తించారని, ఆ డాక్యుమెంట్లను ఈడీ సమర్పించాలని న్యాయమూర్తి పేర్కొన్నారు. ఆ తర్వాతే నోటీసులు ఇచ్చే విషయాన్ని ఆలోచిస్తామన్నారు. అయితే పారదర్శకంగా ప్రొసీడింగ్స్ జరిగాయని, ఎలాంటి సమాచారాన్ని దాటిపెట్టలేదని ఈడీ వాదించింది. ఈ నేపథ్యంలో తదుపరి విచారణను మే 2వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. నేషనల్ హెరాల్డ్ వార్తాపత్రికకు సంబంధించి ఆర్థిక అవకతవకలు జరిగినట్టు ఈడీ వాదనగా ఉంది. దీనిపై ఈడీ చాలాకాలంగా విచారణ జరుపుతోంది. ఇటీవల చార్జిషీటులో సోనియాగాంధీ, రాహుల్ గాంధీ పేర్లను కూడా చేర్చింది. అయితే, తామెలాంటి తప్పిదాలకు పాల్పడలేదని కాంగ్రెస్ పార్టీ చెబుతోంది. రాజకీయ దురుద్దేశంతోనే తమపై కేసులు బనాయించినట్టు ఆరోపిస్తోంది.




## పూరీ బీచ్‌లో కేసీఆర్ సైకత శిల్పం

- ఆవిష్కరించిన ఎమ్మెల్సీ కవిత

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ద్రోహులకు దడపుట్టేలా తెలంగాణ తెగువ చూపుదామని.. గులాబీ హోరెత్తించి ఆత్మ గౌరవాన్ని చాటి చెప్పుదామనిబి బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. బిఆర్ఎస్ రజతోత్సవం తెలంగాణ ఇంటి పండుగ అని పేర్కొన్నారు. కుంభమేళా తరహాలో నిర్వహిస్తున్న ఈ వేడుకకు ప్రతి ఇంటి నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. బిఆర్ఎస్ రజతోత్సవం సందర్భంగా ఒడిశాలోని పూరీ బీచ్‌లో రూపొందించిన కెసిఆర్ సైకత శిల్పాన్ని శుక్రవారం బంజారాహిల్స్‌లోని తన నివాసం నుంచి ఎంఎల్‌సి కవిత ఆవిష్కరించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన డాక్టర్ రవీందర్ యాదవ్ ఈ సైకత శిల్పంలో బిఆర్ఎస్ పార్టీ చీఫ్ కెసిఆర్ చిత్రం, ఛలో వరంగల్ అంటూ పిలుపునివ్వడం.. బిఆర్ఎస్ 25 ఏళ్ల ప్రస్థానానికి సంబంధించిన వివరాలన్నీ పొందుపరిచారు. సైకత శిల్పం రూపొందించిన రవీందర్ యాదవ్‌ను కవిత అభినందించారు. ఈ సైకత శిల్పానికి సంబంధించిన వీడియోను రవీందర్ యాదవ్‌తో కలిసి కవిత విడుదల చేశారు. పార్టీ ప్రస్థానం మొత్తం వివరించేలా సైకత శిల్పం బాగుందని.. పూరీ బీచ్‌లో ప్రముఖ సైకత శిల్పుల ఆధ్వర్యంలో దీనిని రూపొందించడం అభినందనీయమని అన్నారు.

## లష్కరే టాప్ కమాండర్ హతం

బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

జమ్మూకాశ్మీర్ రాష్ట్రంలో దాగివున్న ఉగ్రవాదులపై భద్రతా బలగాలు ఉక్కుపాదం మోపుతున్నాయి. తాజాగా లష్కరే టాప్ కమాండర్ అల్తాఫ్ లల్లీని మట్టుబెట్టాయి. పహల్గాం దాడిలో పాల్గొన్న వారి కోసం జల్లెడపడుతున్న భద్రతా దళాలను బందీపొరాలో అల్తాఫ్ ఆచూకీ తెలిపింది. శుక్రవారం ఉదయం ఆర్మీ పోలీసు దళాలు జాయింట్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో ఉగ్రవాదులను గుర్తించడంతో ఎన్‌కౌంటర్ మొదలైంది. తొలుత ఓ ఉగ్రవాది గాయపడ్డారు. ఆ తర్వాత భద్రతా దళాల్లోని అధికారి బాడీగార్డులకు తూటాలు తాకాయి. ఈ క్రమంలో అల్తాఫ్‌ను మట్టుబెట్టాయి. ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేదీ కాశ్మీర్‌లో అడుగుపెట్టిన వేళ ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకోవడం గమనార్హం.

పహల్గాంలో ఉగ్రవాది వెనుక లష్కర్ చీఫ్ హఫీజ్ సయీద్ పాత్ర నేరుగా ఉన్నట్టు దర్యాప్తు బృందాలు గుర్తించాయి. కాశ్మీర్‌లో చురుగ్గా పని చేస్తున్న మాడ్యూల్‌ను అతడే స్వయంగా నియంత్రిస్తున్నట్లు గుర్తించారు. దీనిలో అత్యధిక మంది విదేశీ ఉగ్రవాదులు, కొందరు మాత్రమే స్థానికులు ఉండేటట్లు చూసుకున్నారు. వీరికి అండగా క్షేత్రస్థాయిలో సమాచార సేకరణ, లాజిస్టిక్స్, దాక్కునేందుకు ప్రదేశాలు ఏర్పాటుచేసేందుకు కొందరు స్థానికులు పనిచేసేవారు

## తెలంగాణ ప్రజల గుండెచప్పుడు బీఆర్ఎస్

- వరంగల్‌లో కనీవిని ఎరుగని రీతిలో రజతోత్సవ వేడుకలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ప్రజల గుండెచప్పుడు బీఆర్ఎస్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని నందినగర్‌లో మీడియా చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు.

తెలంగాణ సమాజం వరంగల్ సభలో కేసీఆర్ సందేశం కోసం ఎదురు చూస్తోందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. 24 ఏండ్ల పాటు ఒక పార్టీ విజయవంతంగా నిలదొక్కుకుని ప్రజల్లో ఉండడమనేది అరుదైన విషయమని అన్నారు. బీఆర్ఎస్ తర్వాత ఒక్క జేఎంఎం పార్టీకే ఆ గౌరవం దక్కిందని గుర్తు చేశారు. ఎన్నో సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేశామని తెలిపారు. ఇప్పుడు ప్రతిపక్ష పార్టీగా కూడా సమర్థ పాత్ర పోషిస్తున్నామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు స్వచ్ఛందంగా తరలి రానున్నారని తెలిపారు. ఢిల్లీ పార్టీలను నమ్మి మోసపోవద్దనీ, తెలంగాణ ఇంటి పార్టీ అయిన బీఆర్ఎస్‌ను ఆదరించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలో పాలన గాడితప్పిందనీ, మంత్రులు, ఎమ్మెల్యేలు సీఎం మాట వినే పరిస్థితిలో లేరని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందిచ్చిన హామీలను అమలు చేయలేక బీఆర్ఎస్‌పై నెపం నెట్టేందుకు కాంగ్రెస్ నేతలు నానా తంటాలు పడుతున్నారని ఆరోపించారు."రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కాంగ్రెస్ నేతలకు ఎన్నికల ముందు తెలియదా? కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టో కమిటీ చైర్మెన్‌గా శ్రీధర్‌బాబు, అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా భట్టి, పీసీసీ అధ్యక్షులుగా రేవంత్‌కు అన్ని విషయాలు తెలుసు. అయినా అడ్డగోలు హామీలిచ్చారు. వాటిని అమలు చేయలేక బీఆర్ఎస్‌పై నెపం నెట్టేసేందుకు కాంగ్రెస్ నేతలు నానా తంటాలు పడుతున్నారు. అప్పుల గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ నేతలకు లేదు. పదేండ్లలో మేం సగటున ఏడాదికి రూ.41 వేల అప్పు చేస్తే, కాంగ్రెస్ ఏడాదిలో రూ.1,60,000 కోట్లు చేసింది" అని రేవంత్ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. అధికారంలో ఉన్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం ఇంకా ప్రతిపక్షంలో ఉన్నట్టే మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆయన తన భాషను, పద్ధతిని మార్చు కోవాలని హితవు పలికారు. కేసీఆర్ అసెంబ్లీకి రావాలా వద్దా అనేది పార్టీ ఇష్టమని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలను విమర్శించడం మాని పాలనపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. రాష్ట్రంలో పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. అలాంటి వారు

మిగితా 2వ పేజీలో

## కేసీఆర్ తెలంగాణ జాతిపిత పాట విడుదల




బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

కేసీఆర్ తెలంగాణ జాతి పిత పాటను మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌తో కలిసి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బంజారాహిల్స్ నందినగర్‌లోని తన నివాసంలో విడుదల చేశారు. ఈ పాటను మానుకోట ప్రసాద్ రచించగా, గానం సాకేత్ అందించారు. ఈ పాటకు స్వరాలు మిథున్ కూర్చారు. డీవోపిగా అజయ్ కొడం కొనసాగగా.. దీనికి సహకారం మద్దెల సందీప్ అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దయాకర్‌రెడ్డి, నేవూరి ధర్మేందర్‌రెడ్డి, పల్లా ప్రవీణ్‌రెడ్డి, వల్లమల్ల కృష్ణ, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పడాల సతీష్, కల్లెట్లపల్లి శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆ ఉగ్రవాదులు స్వాతంత్ర్య సమరయోధులు

- పాక్ ఉప ప్రధాని ఇషాక్ దార్




**బలగం టీవి, ఇస్లామాబాద్**

పెహల్గామ్ ఉగ్రదాడిపై పాక్ ఉప ప్రధాని ఇషాక్ దార్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. పెహల్గామ్ దాడికి పాల్పడిన ఉగ్రవాదులు.. స్వాతంత్ర్య సమరయోధులుగా ఇషాక్ అభివర్ణించారు. ఇస్లామాబాద్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఇషాక్ దార్ మాట్లాడుతూ.. 'మంగళవారం మధ్యాహ్నం ఏప్రిల్ 22న జమ్మూకాశ్మీర్‌లోని పెహల్‌గామ్‌లోని బైసరాన్ లోయలో ఉగ్రదాడికి పాల్పడిన వారు.. స్వతంత్ర్య సమరయోధులై ఉండొచ్చు' అని ఆయన అన్నారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సంచలనంగా మారాయి.

# ఉక్రెయిన్‌తో ఒప్పందానికి సిద్ధంగా ఉన్నాం

- రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్



**బలగం టీవి, మాస్కో**

ఉక్రెయిన్‌తో ఒప్పంద చేసుకోవడానికి మాస్కో సిద్ధంగా ఉందని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ పేర్కొన్నారు. తాము ఒప్పందానికి సిద్ధంగా ఉన్నామని, కానీ కొన్ని అంశాలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాల్సి వుందని అన్నారు. ప్రస్తుతం ఆ అంశాల్లో బిజీగా ఉన్నామని సెర్గీ గురువారం మీడియాతో పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షులు ట్రంప్ రాయబారి స్టీవ్ విట్కాఫ్ శుక్రవారం రష్యాలో పర్యటించనున్నారు. కాల్పుల విరమణపై పుతిన్‌తో మరో రౌండ్ చర్చలు జరపనున్నారు. చర్చల ప్రక్రియ సరైన దిశలో సాగుతోందని, వాషింగ్టన్‌తో చర్చలు కొనసాగుతాయని సెర్గీ లావ్రోవ్ అన్నారు.




# ఉన్మాదులను తుది ముట్టించాలి...

**బలగం టీవీ, సిరిసిల్ల**

పహల్గామ్ లో జరిగిన దాడి దురదృష్టకరమని అమాయకులైన 26 మందిని బలిగొన్న ఉన్మాదులను తుది ముట్టించాలని సిరిసిల్ల మజీద్ కమిటీ నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలో మజీద్ కమిటీ ఆధ్వర్యంలో నల్ల జెండాలతో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. పాకిస్తాన్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మజీద్ కమిటీ నాయకులు మాట్లాడుతూ భారత దేశంలో అన్నదమ్ములల కలిసి మెలిసి ఉన్న హిందూ ముస్లింలలో వైశాల్యాలు సృష్టించి లేనిపోని అపోహలు కల్పించి దేశంలో కునుకు లేకుండా ఉగ్రదాడులు చేస్తున్నారని అన్నారు. పహల్గామ్ లో అమాయకులైన 26 మందిని బలిగొన్నారని అమాయకులైన వారి ప్రాణాలను బలిగొన్న ఉన్మాదులను తుద ముట్టించాలని డిమాండ్ చేశారు.

# భారత్ సమ్మిట్ చారిత్రాత్మకమైనది

**బలగం టీవీ, హైదరాబాద్**

వ్యక్తం చేశారు. ప్రగతిశీల ఆలోచనతో ప్రపంచానికి తెలంగాణను మోడల్‌గా చూపిం చేందుకు సమ్మిట్ ఉపయోగపడుతున్నదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చారిత్రాత్మక సమ్మిట్ తెలంగాణ మార్కెట్‌కు, పెట్టుబడులను ఆకర్షించేందుకు, సంపద పెంచుకునేందుకు, నిరుద్యోగులకు ఉద్యోగవకాశాలు కల్పించేందుకు దోహదపడుతుందన్నారు. సమ్మిట్‌కు దాదాపు వంద దేశాలకు చెందిన 450 మంది కార్పొరేట్ ప్రముఖులు, విదేశీ ప్రభుత్వాల ప్రతినిధులు హాజరయ్యారు. ఉగ్రదాడికి నిరసనగా సంతాపం తెలిపే కార్యక్రమంలో తాము కూడా భాగస్వాములవుతామని విదేశీ ప్రతినిధులు ఆసక్తి చూపించినట్టు భట్టి వెల్లడించారు. తద్వారా కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం తలపెట్టిన ఉగ్రవాద వ్యతిరేక కార్యక్రమంలో ప్రపంచం మొత్తాన్ని భాగస్వాములను చేసినట్టైందన్నారు. ఏఐసీసీ సభ్యులు సల్మాన్ ఖుర్షీద్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సామాజిక న్యాయం దేశానికే ఆదర్శమని ప్రశంసించారు. రాహుల్ గాంధీ అందరికీ సామాజిక న్యాయం కోసం పోరాడుతున్నారని తెలిపారు. దానిని సాధించేందుకు అవసరమైన డాటా, విశ్లేషణ అవసరమనీ, ఆ దిశగా తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రయత్నం అభినందనీయమని చెప్పారు. సామాజిక న్యాయాన్ని అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. భారత్ సమ్మిట్ 2025లో భాగంగా శుక్రవారం జరగాల్సిన పలు కార్యక్రమాలు శనివారానికి వాయిదా వేశారు. తెలంగాణ సాంస్కృతిక కార్యక్రమాలతో విదేశీ ప్రతినిధులకు ఘనంగా ఆహ్వానం పలికేందుకు రూపొందించుకున్న కార్యక్రమాలన్నీ రద్దు చేసింది. కేంద్ర ప్రభుత్వం టెర్రరిస్టు దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాప దినంగా ప్రకటించడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి చేయాల్సిన హైదరాబాద్ డిక్లరేషన్ సైతం వాయిదా పడింది.

# వానకాలం పంటల ప్రణాళికపై చర్చా గోష్ఠి

- రైతులతో శాస్త్రవేత్తల చర్చా

**బలగం టీవీ, బోయినిపల్లి**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఏరువాక కేంద్రం, కరీంనగర్ వారి ఆధ్వర్యంలో గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల, జిల్లెల విద్యార్థులు రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంతడగొండ గ్రామంలో రైతు సదస్సు మరియు వ్యవసాయ ప్రదర్శనతో పాటు వానకాలం పంటల ప్రణాళిక మీద రైతులతో శాస్త్రవేత్తల చర్చా గోష్ఠి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఏరువాక కేంద్రం, కోఆర్డినేటర్ డా. మదన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ: వ్యవసాయంలో వస్తున్న అధునాతన సాంకేతిక విధానాలని అందిపుచ్చుకోవాలని సూచించారు. అలాగే రాబోయే వానకాలంలో రైతులందరూ పంటల సాగులో శాస్త్రవేత్తల చెప్పే మెళకువలు పాటించాలని కోరారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంచాలకులు డా. శ్రీలత మాట్లాడుతూ: రైతులందరూ మారుతున్న వాతావరణానికి అనుగుణంగా పంటల సరళిని మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. అదే విధంగా మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేసినట్లయితే రైతులకు లాభం ఉంటుందని తెలియచేసారు. బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల జిల్లెల్ల, అసోసియేటెడ్ డీన్ డా. కే.బి.సునీత దేవి మాట్లాడుతూ: వివిధ పంటలలో నూతన పద్ధతులను మరియు నీటి యాజమాన్యంపై రైతులకు తెలిపారు.

జిల్లా వ్యవసాయ అధికారినీ అఫ్జల్ బేగం మాట్లాడుతూ: పంటల మార్పిడి మరియు యాజమాన్య పద్ధతులపై రైతులకు సూచనలు ఇచ్చారు. తదనంతరం వ్యవసాయ పరిశోధన స్థానం, కరీంనగర్ శాస్త్రవేత్త డాక్టర్ మధుకర్ రావు, వానకాలం ఆరుతడి పంటల సాగు మరియు ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. తరువాత డా. జి ఉషారాణి, వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి విడుదలైన వంగడాల గురించి తెలిపారు. తరువాత జిల్లా ఏరువాక కేంద్రం, శాస్త్రవేత్త డా.ఎమ్. రాజేంద్రప్రసాద్ వివిధ పంటలలో చీడపీడల గురించి తెలిపారు. వ్యవసాయ ప్రదర్శనలో భాగంగా గ్రామీణ వ్యవసాయం కృషి అనుభవ కార్యక్రమం విద్యార్థులు, వ్యవసాయ ప్రదర్శనలు ఏర్పాటు చేసి వాటి ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏరువాక కేంద్రం, కరీంనగర్ కోఆర్డినేటర్ డా. కె. మదన్ మోహన్ రెడ్డి, శాస్త్రవేత్త డా. రాజేంద్రప్రసాద్, వ్యవసాయ పరిశోధన స్థానం, కరీంనగర్ హెడ్, డా. జి. ఉష రాణి మరియు శాస్త్రవేత్త డా. పి. మధుకర్ రావు, బాబు జగ్జీవన్ రావు వ్యవసాయ కళాశాల, సిరిసిల్ల అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ఇందుజా, డా. మాధవి, డా. అరుణ్, జిల్లా వ్యవసాయ అధికారిని శ్రీమతి అఫ్జల్ బేగం, వ్యవసాయ సహా సంచాలకులు రామారావు, మాజీ సర్పంచ్ చిందం రమేష్ , మాజీ ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్ , మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుడి రాజశేఖర్ రెడ్డి,గుడి శ్రీనివాస్ రెడ్డి ,మండల వ్యవసాయ అధికారులు కవిత, వ్యవసాయ విస్తరణ అధికారులు మరియు ఆర్.ఏ.డబ్ల్యు.ఈ.పి విద్యార్థినులు మరియు రైతులు పాల్గొన్నారు.

# పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడి బాధాకరం




**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ**

జమ్ము కశ్మీర్ లోని పహల్గామ్ లో ఉగ్రవాదుల దాడి బాధాకరం అని,ఉగ్ర దాడిని ముక్త కంఠంతో ఖండిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు... శుక్రవారం వేములవాడ పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జమ్మూ కాశ్మీర్లో జరిగిన ఉగ్ర దాడిని నిరసిస్తూ దాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ అంబేద్కర్ చౌరస్తా నుండి మహంకాళి చౌరస్తా వరకు నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు..

ఈ సందర్భంగా అది శ్రీనివాస్ మాట్లాడుతూ కాశ్మీర్ లోని ఉగ్రదాడిలో మరణించిన వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతున్నని, దాడిలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు మనోధార్యాన్ని కల్పించాలని రాజరాజేశ్వర స్వామి వారిని వేడుకున్నట్లు తెలిపారు.. ఉగ్ర దాడులతో చాలా దేశాలు ఇబ్బందులు పడుతున్నయని, ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే ఏ దేశం కూడా మనగడ సాధించ లేదన్నారు..ఈ ఘటనను హేయమైన చర్యగా అభివర్ణించిన ఇటువంటి కిరాతక చర్యలు భారత ప్రజల సమైక్యతను, ధైర్యాన్ని ఎన్నటికీ దెబ్బతీయలేవుఅని,ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా జాతి మొత్తం ఏకం కావలసిన సమయం ఆసన్నమైందని అన్నారు.. ఈ దాడి చేసిన ఉగ్రవాదులను గుర్తించి వారిని వారి సంస్థను మట్టుబెట్టాలని పేర్కొన్నారు..ఈ దాడికి బాధ్యత వహిస్తున్న ఉగ్రవాద సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. కేంద్రం ఎటువంటి సంకోచం లేకుండా కఠినంగా వ్యవహరించాలనీ కోరుతు,మృతుల కుటుంబాలకు సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు..

# పహల్గాం నిందితులను కఠినంగా శిక్షించాలి

**దేశం ముందు మతం గొప్పది కాదు**

**మాజీ మండల కో-ఆప్షన్ మెంబర్ మహ్మద్ ఆజ్జు**

**బలగం టీవీ, బోయినిపల్లి**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం. జమ్మూ కాశ్మీర్లోని పహల్గాం వద్ద ఉగ్రవాదులు దాడి చేసి 26 మందిని కాల్చి చంపడం హేయమైన చర్య అని, నరమేదానికి పాల్పడిన ఉగ్రవాదులపై భారత ప్రభుత్వం ప్రతీకారం తీర్చుకోవాలని బోయినిపల్లి మండల మాజీ కో-ఆప్షన్ మెంబర్ మహ్మద్ ఆజ్జు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పహల్గాం ఉగ్ర దాడిలో మరణించిన వారందరికీ అశ్రునివాళులు అర్పిస్తున్నాం అని అన్నారు.

ఈ సందర్భంగా ఆజ్జు మాట్లాడుతూ: దేశంలోని ముస్లిం సమాజమంతా దేశభద్రతకు మద్దతుగా నిలుస్తుందన్నారు. దేశముందు మతం గొప్ప కాదని, ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో అణచివేయాలి అని అన్నారు.

# తెలంగాణ ప్రజల గుండెచప్పుడు బీఆర్ఎస్

(మొదటి పేజీ తరువాయి)

భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలను చేర్చుకునే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. మేడిగడ్డ బ్యారేజీపై డిసెంబర్ 2024లో ఎన్‌డీఎస్‌ఏ సిద్ధం చేసిన రిపోర్టును ఇప్పుడెందుకు బహిర్గతం చేశారని ప్రశ్నించారు. ఇది ఎన్‌డీఎస్ రిపోర్ట్ కాదనీ, ఎన్‌డీఏ రిపోర్టని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బీజేపీ మూడో స్థానానికే పరిమితమవుతుందని కేటీఆర్ అన్నారు. ఎంపీ ఎన్నికల్లో మోడీ పేరు చెప్పి బీజేపీ ఎనిమిది సీట్లు గెలుచుకుందని వ్యాఖ్యానించారు. ఎంపీ ఎన్నికల్లో దేశభక్తి అంటూ ప్రజలను పక్కదారి పట్టించి గెలిచిందని విమర్శించారు. రానున్న 2028 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు కాంగ్రెస్‌తోనే పోటీ అని కేటీఆర్ స్పష్టం చేశారు. 2014 ఎన్నికల నుంచి 2023 ఎన్నికల వరకు ఫలితాలను చూస్తే దేశ వ్యాప్తంగా మోడీ ప్రభ తగ్గుతోందన్నారు. రాష్ట్రంలో బీజేపీ ఏ ముఖం పెట్టుకుని ఓట్లడుగుతుందని విమర్శించారు.

# డ్రగ్స్ నియంత్రణపై విస్తృతంగా ప్రచారం కల్పించాలి

**-మాదకద్రవ్యాల నియంత్రణకు క్షేత్ర స్థాయిలో సమన్వయంతో పని చేయాలి..**

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

మాదకద్రవ్యాల నియంత్రణకు క్షేత్ర స్థాయిలో సమన్వయంతో పని చేయాలని జ కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సంబంధిత అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి నార్కో సమన్వయ సమావేశాన్ని ఎస్పీ మహేష్ బి గీతే తో కలిసి సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ముఖ్య ప్రణాళిక అధికారి ప్రస్తుతం క్రాప్ కటింగ్ పరిశోధనలు జరుపుతున్నారని, వీరితో సమయం చేసుకుంటూ ఎక్కడైనా గంజాయి సాగు జరుగుతుందో పరిశీలించి చర్యలు తీసుకోవాలని అన్నారు.

పాఠశాలలో ముగుస్తున్నందున పరిసరాల్లో ఉన్న పాన్ షాప్ వంటి వాటి పై నిఘా పెట్టాలని అన్నారు. జిల్లాలో ఎక్కడా కూడా ఓపెన్ డ్రింకింగ్ జరగకుండా చూడాలని అన్నారు. ప్రతి మండలంలో తహసిల్దార్, ఎంపిడిఓ, పోలీస్, మండల వ్యవసాయ అధికారి వైద్య అధికారులు పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి డ్రగ్స్ నియంత్రణ ప్రణాళిక రూపొందించాలని అన్నారు.

జిల్లాలో ఉన్న బార్లు, వైన్ షాప్ ప్రభుత్వ నిర్దేశిత సమయపాలన పాటించేలా చూడాలని అన్నారు. బార్ నిర్వాహకులతో వాట్స్ అప్ గ్రూప్ తయారు చేయాలని ప్రతి రోజూ ఎప్పుడు మూసి వేస్తున్నారో సమాచారం అందించాలని అన్నారు. డ్రగ్స్ నియంత్రణ పై విస్తృతంగా ప్రచారం కల్పించాలని, అవగాహన కార్యక్రమాల్లో డ్రగ్స్, గంజాయి వల్ల కలిగే నష్టాలు వివరించే వీడియోలను, పోస్టర్లను ప్రదర్శించాలని అన్నారు. డ్రగ్స్ పరీక్షల నిర్వహణకు అవసరమైన యూరిన్ కిట్లను పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారుల వద్ద అవసరమైన మేర అందుబాటులో ఉంచాలని వైద్యారోగశాఖ అధికారికి సూచించారు. కళాశాలలో సడన్ గా వింతగా ప్రవర్తించే విద్యార్థులను గుర్తించాలని, ఎవరైనా డ్రగ్స్ గంజాయి తీసుకుంటున్నట్లు తెలిస్తే వారికి అవసరమైన కౌన్సిలింగ్ అందజేయాలని అన్నారు. జిల్లాలో ఉన్న రైస్ మిల్లులు, ఇటుక బట్టీల వద్ద అసిస్టెంట్ లేబర్ అధికారి ఆధ్వర్యంలో డ్రగ్స్ నియంత్రణ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలనిఅన్నారు.

ఎస్పీ మహేష్ బి గీతే మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లాలో డ్రగ్స్ మాదకద్రవ్యాల నియంత్రణకు పక్కా నిఘా ఏర్పాటు చేశామని, డ్రగ్స్ చిన్న సంఖ్య లో ఉన్నా కూడా తప్పనిసరిగా సీజ్ చేయాలని, జిల్లాలో ఓపెన్ డ్రింకింగ్ బంద్ చేయాలని అన్నారు. ఆలయ పరిసరాల ప్రాంతంలో వైన్ షాప్ ఉండకుండా చూడాలని అన్నారు.

గ్రామ స్థాయి నుంచి డ్రగ్స్, గంజాయి అలవాటు ఉన్నట్లు ఏదైనా అనుమానం కలిగితే వెంటనే తమకు సమాచారం అందించాలని, మా దగ్గర అవసరమైన మేర డ్రగ్స్ నిర్ధారణ కిట్లు, నార్కోటిక్స్ గుర్తించే డాగ్స్ అందుబాటులో ఉన్నాయని వెంటనే పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, అనంతరం మాదకద్రవ్యాల నిర్మూలన వాల్ పోస్టర్స్, హ్యాండ్ బుక్ లను ఆవిష్కరించారు.ఈ సమావేశంలో సిరిసిల్ల రెవెన్యూ డివిజన్ అధికారీ రాధా బాయి , అసిస్టెంట్ లేబర్ అధికారి నాజర్ అహ్మద్, డ్రాగ్ ఇన్స్పెక్టర్ భవాని, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్, ఫుడ్ సేఫ్టీ అధికారి అనూష,విద్యా, వ్యవసాయ శాఖ అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# ఇష్టం వచ్చినట్లు సైన్ బోర్డులు...

- **వాహనదారుకు తప్పని తిప్పలు**

**బలగం టీవీ, ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలోని ప్రముఖ వ్యాపారవేత్తలు రోడ్ల పైన ఇష్టం వచ్చినట్లు సైన్ బోర్డులు ఏర్పాటు చేసి వచ్చి పోయే వాహనదారులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. వాహనదారుల తెలిపిన సమాచారం మేరకు ముస్తాబాద్ మండల కేంద్రంలో పలు వ్యాపారవేత్తలు పంచాయతీ లైసెన్స్ పొంది,పొందని వారు నిబంధనలకు విరుద్ధంగా రోడ్లమీద ఇనుప, కంకర, కట్టే మొదలగున వాటితో తయారుచేసిన సైన్ బోర్డులను ఆర్ అండ్ బి అధికారుల పర్మిషన్ లేకుండా వారి వారి షాపులు ముందుఏర్పాటు చేసుకున్నారు. దీంతో వెళ్లేటప్పుడు ఆ బోర్డులు తగిలి ప్రాణాల తోపాటు గాయాలు అయ్యే అవకాశం ఉన్నదని తెలిపారు. ఈ విషయానికై పంచాయతీ కార్యదర్శి రమేష్ ను చరవాణి ద్వారా వివరణ కోరగా అలాంటివి ఏమైనా తమదృష్టికి వస్తే ఖచ్చితంగా వారికి నోటీసు ఇచ్చి భారీ జరిమానా విధిస్తామని తెలిపారు.

# మలేరియా నిర్మూలనలో భాగస్వామ్యులు కావాలి..

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝాలి**

**బలగం టీవీ,ఎల్లారెడ్డిపేట**



రాజన్న సిరిసిల్ల జిల్లాలో మలేరియాను సమూలంగా నిర్మూలించే ప్రక్రియలలో అందరూ భాగస్వామ్యులు కావాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మలేరియా నిర్మూలనపై ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరై, అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ మలేరియా వ్యాప్తి, వ్యాధి నిర్ధారణ, వైద్య సదుపాయం, వైద్యం అందించే విధానం తదితర అంశాలపై క్లుప్తంగా వివరించారు. జిల్లాలో గతేడాది మలేరియా కేసులు నమోదు కాలేదని తెలిపారు. దీనిలో భాగస్వామ్యులైన వైద్యులు, సిబ్బంది, పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులు, సిబ్బందిని అభినందించారు. రానున్న రోజుల్లో కూడా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేస్తూ ఇవే ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు..

వైద్యులు, సిబ్బంది తమ పరిధిలోని వార్డులు, గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని, దోమతెరలు వాడాలని, దోమలు కుట్టకుండా చూసుకోవాలని తదితర అంశాలపై అవగాహన కల్పించాలనిఅన్నారు. పంచాయతీ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తమ పరిధిలోని ప్రాంతాల్లో మురుగు కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, ఎక్కడైనా మురుగునీరు నిలిస్తే బ్లీచింగ్ పౌడర్ వేసి, ఆయిల్ బాల్స్ వేయాలని దోమల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని దవాఖానాల్లో మలేరియా నిర్ధారణ కిట్లు అందుబాటులో ఉన్నాయని, వైద్యులు, సిబ్బంది మలేరియా లక్షణాలు ఉన్న వారికి నిర్ధారణ పరీక్షలు చేయాలని వారికి సరైన వైద్యం అందించాలనిఅన్నారు. ప్రజలు కూడా తమ పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని,తమ ఇల్లు, పరిసరాలు ఎంత శుభ్రంగా ఉంచుకుంటారో..ప్రజలు కూడా అలాగే తమ ఇల్లు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రజిత, ప్రోగ్రామ్ ఆఫీసర్ అనిత, మెడికల్ ఆఫీసర్ ప్రదీప్, పీహెచ్ సీ డాక్టర్ సయ్యద్ సయిరా అంజుమ్, డాక్టర్లు, ఆశ కార్యకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# భూభారతి చట్టంతో రైతులకి ఎంతో మేలు

**-భూ సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యం**

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ, సిరిసిల్ల**

అన్ని అర్హతలు ఉండి భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారికి భూభారతి చట్టంతో ఎంతో మేలు చేకూరుతుందని,అర్హులందరూ చట్టాన్నిసద్వినియోగం చేసుకొని హక్కులను పొందాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన భూ భారతి (రికార్డు ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్) చట్టం 2025పై అవగాహన సదస్సును ముస్తాబాద్ మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించగా, ముఖ్యఅతిథిగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన భూ భారతి అమల్లోకి వచ్చిందని, ముందుగా రాష్ట్రంలోని 4 మండలాలలో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ చట్టం అమలు చేస్తున్నారనిఅన్నారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతి గ్రామంలో గ్రామ పరిపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందనిఅన్నారు.

ప్రస్తుతం ధరణి లో ఉన్న భూ రికార్డులు భూ భారతి చట్టంలో కొనసాగుతాయని,భూ హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు అర్హులైన వారు జిల్లాలో నూతన చట్టం అమల్లోకి వచ్చిన ఏడాదిలోగా దరఖాస్తు చేసుకోవాలనిఅన్నారు.ఆ దరఖాస్తులను పరిశీలించి రెవెన్యూ డివిజన్ అధికారి, కలెక్టర్ ఒక నిర్ణయం తీసుకుంటారని, దరఖాస్తుదారునికి ఏమైనా అభ్యంతరాలు ఉంటే కలెక్టర్, భూమి ట్రిబ్యూనల్ లో అప్పీల్ చేసుకోవచ్చునిఅన్నారు. భూ సమస్యలు హద్దుల సమస్యలు రాకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నూతన చట్టంలో జియో ట్యాగింగ్ తో,అలాగే మ్యాప్ తో పాస్ పుస్తకాలను జారీ చేయనుందనిఅన్నారు. దీంతో రైతులకు దారి సమస్య ఇతర ఇబ్బందులు ఎదురుకావని అన్నారు.ఇక్కడ ఆర్డీఓ రాధాభాయి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తలారి రాణి, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, తహశీల్దార్ సురేష్, తదితరులు ఉన్నారు.

# పహల్గావ్ ఉగ్రదాడి మృతులకు రెడ్డి సంఘం సంతాపం

- **బాధితుల కుటుంబాలకు అందరూ మద్దతుగా నిలవాలి**
- **రాజన్న సిరిసిల్ల జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రెండు రోజుల క్రితం కాశ్మీర్‌లోని పహల్గావ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 27 మంది హిందూ బంధువులు మృతి చెందడం పట్ల రాజన్న సిరిసిల్ల జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఈ ఉగ్రదాడి అత్యంత దారుణమైన చర్యగా ఆయన అభివర్ణించారు. అన్ని కులాలను సమానంగా, సోదర భావంతో చూసే భారతదేశంలో ఇలాంటి దుర్ఘటన జరగడం చాలా బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో హిందువులపై ఇలాంటి దాడులు జరిగితే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

ఈ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తూ, మృతి చెందిన హిందూ బంధువుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన ప్రార్థించారు. వారి కుటుంబాలకు సంఘం తరపున మనోధైర్యాన్ని అందిస్తూ అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ విషాద సమయంలో అందరూ కలిసి బాధితుల కుటుంబాలకు మద్దతుగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నల్ల నాగిరెడ్డి, ఉపాధ్యక్షులు ఎగుమామిడి కృష్ణారెడ్డి, మడుపు ప్రమోదరెడ్డి, నరెడ్ల రాఘవరెడ్డి, గుల్లపల్లి నరసింహారెడ్డి, డబ్బు తిరుపతిరెడ్డి, గడ్డమీద ప్రసాద్ రెడ్డి, కూతురు వెంకట్ రెడ్డి, లక్కిరెడ్డి కమలాకర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులు దుండ్రా జలజా రెడ్డి, ముసుకు తిరుపతిరెడ్డి, ఏమి రెడ్డి కనక రెడ్డి, జువ్వెంతుల లక్ష్మారెడ్డి, మంద బాల్ రెడ్డి, కోశాధికారి ఎడ్మల హనుమంత రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ భీమ నీలిమారెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ మడుపు ప్రేమ్ సాగర్ రెడ్డి, కంకణాల శ్రీనివాస్ రెడ్డి, ముత్యాల రాజిరెడ్డి, కంది భాస్కర్ రెడ్డి, కరెడ్ల మల్లారెడ్డి, అబ్బాడి తిరుపతి రెడ్డి, గడ్డం సత్యనారాయణ రెడ్డి, బిచ్చల రాజిరెడ్డి లు తమ సంతాపం తెలిపారు.



# పాక్ అథ్లెట్‌కు నీరజ్ చోప్రా ఆహ్వానం

- వెల్లువెత్తిన విమర్శలు
- ఉగ్రదాడి ఘటనకు రెండు రోజుల ముందే ఆహ్వానం పంపినట్టు నీరజ్ వివరణ
- నా కుటుంబాన్ని టార్గెట్ చేయడం బాధ కలిగించింది : నీరజ్




**బలగం టీవీ, హైదరాబాద్**

పాకిస్థానీ జావెలిన్ త్రో క్రీడాకారుడు అర్షద్ నదీమ్‌ను బెంగళూరులో జరగనున్న ఓ క్రీడా ఈవెంట్‌కు జావెలిన్ త్రోయర్, ఒలింపిక్ మెడల్ విజేత నీరజ్ చోప్రా ఆహ్వానించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. దాంతో నీరజ్ చోప్రా దీనిపై వివరణ ఇచ్చారు. పహల్గామ్ దాడికి ముందే తాము ఈ ఆహ్వానాన్ని పంపించామని స్పష్టం చేశారు. తనపై, తన కుటుంబసభ్యులపై అకారణంగా ద్వేషం చిమ్మడం సరికాదని హితవు పలికాడు. వచ్చే నెలలో జరగనున్న ఈ ఈవెంట్‌కు అర్షద్ జావేద్‌కు ఆహ్వానం పంపించగా అతడు ఇప్పటికే తిరస్కరించాడు. అయితే, పహల్గామ్ దాడి నేపథ్యంలో తనపై, ఫ్యామిలీపై విమర్శలు, ఎక్కువవడంతో నీరజ్ చోప్రా స్పందించాడు.

ఎన్‌సీ క్లాసిక్ ఈవెంట్ ద్వారా ఉత్తమ అథ్లెట్లను ఇండియాకు తీసుకురావాలన్నదే తన ఉద్దేశం అని, వరల్డ్ క్లాస్ స్పోర్టింగ్ ఈవెంట్‌లను నిర్వహించాలని భావిస్తున్నామని, సోమవారం రోజే అథ్లెట్లకు అందరికీ ఆహ్వానాలు వెళ్లాయని, పెహల్గామ్ దాడికి రెండు రోజుల ముందే ఆహ్వానాలు పంపినట్లు నీరజ్ తన ఎక్స్ అకౌంట్‌లో చెప్పాడు. ఉగ్రదాడి ఘటన తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు.. తమ కుటుంబాన్ని బాధించినట్లు చెప్పాడు. దేశ గౌరవాన్ని ఉన్నత స్థాయికి చేర్చిన తనకు ఇప్పుడు సమాధానం ఇచ్చుకోవాల్సి వస్తోందని, తన కుటుంబాన్ని టార్గెట్ చేయడం నిరుత్సాహానికి గురి చేస్తున్నదని, మేం చాలా సాధారణ వ్యక్తులమని, మరో విధంగా తమను చిత్రీకరించవద్దు అని నీరజ్ చోప్రా తెలిపాడు. తన గురించి తప్పుడు ప్రచారం చేస్తున్న మీడియాను నీరజ్ తప్పుపట్టాడు. తన మౌనాన్ని అంగీకరంగా భావించరాదు అని, ఒకప్పుడు తన తల్లిని పొగిడిన వాళ్లే ఇప్పుడు విమర్శిస్తున్నారని పేర్కొన్నాడు. దేశం గర్వించే విధంగా, ప్రపంచం గుర్తించే విధంగా మరింత కఠినంగా పనిచేయనున్నట్లు చెప్పారు.

నీరజ్ చోప్రా క్లాసిక్ ఈవెంట్‌ను మే 24వ తేదీన బెంగుళూరులో నిర్వహించనున్నారు. అయితే ఆ టోర్నీలో పాల్గొనడం లేదని పాక్ అథ్లెట్ హర్షద్ నదీమ్ స్పష్టం చేశారు. ఏషియన్ చాంపియన్‌షిప్ కోసం శిక్షణా కార్యక్రమంలో పాల్గొనున్నట్లు చెప్పారు. మే 27 నుంచి 31 వరకు జరిగే ఏషియన్ చాంపియన్‌షిప్‌లో నదీమ్ పాల్గొననున్నాడు. దీని కోసం ఆయన మే 22వ తేదీన దక్షిణ కొరియా వెళ్లనున్నాడు.

# ఎట్టకేలకు హైదరాబాద్ విజయం

- చెన్నై సూపర్ కింగ్స్‌పై 5 వికెట్ల తేడాతో హైదరాబాద్ గెలుపు
- ఇషాన్ కిషన్, కమిందు మెండిస్ రాణింపు




**బలగం టీవీ, హైదరాబాద్**

ఐపిఎల్18లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఎట్టకేలకు మూడో విజయం నమోదు చేసింది. శుక్రవారం చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో ఐదు వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. తొలుత బ్యాటింగ్ బ్యాటింగ్ చేసిన చెన్నై 19.5 ఓవర్లలో 154 పరుగులు చేసింది. సీనియర్ బౌలర్ షమి ఇన్నింగ్స్ తొలి బంతికే చెన్నై ఓపెనర్ షేక్ రషీద్‌ను ఔట్ చేశాడు. అయితే మరో ఓపెనర్ ఆయుష్ మాత్రె మాత్రం ప్రత్యర్థి టీమ్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ స్కోరును ముందుకు తీసుకెళ్లాడు. వన్‌డౌన్‌లో వచ్చిన సామ్ కరన్ 9 పరుగులు మాత్రమే చేసి ఔటయ్యాడు. ధాటిగా ఆడిన మాత్రె 19 బంతుల్లో ఆరు ఫోర్లతో 30 పరుగులు చేసి వెనుదిరిగాడు. జడేజా ఒక ఫోర్, సిక్స్‌తో 21 పరుగులు చేసి పెవిలియన్ చేరాడు. మరోవైపు డెవాల్డ్ బ్రెవిస్ కీలక ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్నాడు. అద్భుత బ్యాటింగ్‌ను కనబరిచిన బ్రెవిస్ 25 బంతుల్లో 4 సిక్సర్లు, ఒక ఫోర్‌తో 42 పరుగులు చేసి ఔటయ్యాడు. శివమ్ దూబె (12), కెప్టెన్ ధోనీ (6), అన్షుల్ కంబోజ్ (2) కూడా జట్టుకు అండగా నిలువలేక పోయారు. ఇక హైదరాబాద్ బౌలర్లలో హర్షల్ పటేల్ 28 పరుగులకే నాలుగు వికెట్లు తీశాడు. కమిన్స్, ఉనద్కట్ రెండేసి వికెట్లను తీశారు.

తర్వాత లక్ష్యఛేదనకు దిగిన హైదరాబాద్ 18.4 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుం ది. అభిషేక్ శర్మ (0) ఖాతా తెరవకుండానే ఔటయ్యాడు. అయితే వన్‌డౌన్‌లో వచ్చిన ఇషాన్ కిషన్‌తో కలిసి మరో ఓపెనర్ హెడ్ ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లాడు. హెడ్ 4 ఫోర్లతో 19 ప రుగులు చేశాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన ఇషాన్ 5 ఫోర్లు, సిక్స్‌తో 44 పరుగులు సాధించాడు. అనికేత్ వర్మ (19), కమిందు మెండిస్ 32 (నాటౌట్), నితీశ్ కుమార్ రెడ్డి 19 (నాటౌట్) అద్భుత బ్యాటింగ్‌తో జట్టును గెలిపించారు.




# త్వరలోనే న్యూజిలాండ్ క్రికెట్ కొత్త లీగ్..

NZC | MAJOR LEAGUE CRICKET MLC


**బలగం టీవీ, హైదరాబాద్**

ఐపీఎల్ తరహాలో పలు దేశాల్లో క్రికెట్ లీగ్స్ జరుగుతున్నాయి. ఈ మేరకు ఫ్రాంచైజ్ క్రికెట్ క్రేజ్ గుర్తించిన న్యూజిలాండ్ క్రికెట్ కూడా త్వరలోనే కొత్త లీగ్‌కు శ్రీకారం చుట్టనుంది. పరాయి గడ్డపై ఒక టీ20 లీగ్‌ను నిర్వహించనుంది. తద్వారా విదేశంలో ఫ్రాంచైజ్ క్రికెట్ జరపనున్న ఐసీసీ పూర్తి సభ్యత్వం కలిగిన తొలి దేశంగా న్యూజిలాండ్ రికార్డు సృష్టించనుంది. అమెరికాకు చెందిన ట్రూ నార్త్ స్పోర్ట్స్ వెంచర్స్‌తో కలిసి కొత్త మేజర్ క్రికెట్ లీగ్ ప్రారంభానికి కివీస్ సన్నాహకాలు చేస్తోంది.

2027 నుండి నార్త్ అమెరికాలోని మెజర్ లీగ్ క్రికెట్‌లో ఫ్రాంచైజీ ప్రారంభించేందుకు న్యూజిలాండ్ క్రికెట్, అమెరికా కేంద్రంగా ఉన్న ట్రూ నార్త్ స్పోర్ట్స్ వెంచర్స్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఐసీసీకి చెందిన పూర్తి సభ్యుడైన క్రికెట్ బోర్డు ఒక విదేశీ ప్రొఫెషనల్ క్రికెట్ లీగ్‌లో ఫ్రాంచైజీకి మద్దతుగా ఒప్పందం కుదుర్చుకోవడం ఇదే మొదటిసారి. ఇందులో భాగంగా, న్యూజిలాండ్ క్రికెట్ కోచింగ్, మేనేజ్మెంట్, సహాయక సిబ్బంది సహా హై-పర్ఫార్మెన్స్ మరియు ఆపరేషన్ మద్దతు అందించనుంది.

ఎంఎల్‌సీ సహ వ్యవస్థాపకులు సమీర్ మెహతా మరియు విజయ్ శ్రీనివాసన్ రెండు విస్తరణ ఫ్రాంచైజీలను ప్రారంభించేందుకు ప్రత్యేక హక్కులను కలిగి ఉన్న సంస్థల ప్రధాన వాటాదారులు. ఇందులో మొదటి ఫ్రాంచైజీని ట్రూ నార్త్ స్పోర్ట్స్ 2027లో ప్రారంభించనుంది.టోరొంటో, అట్లాంటా వంటి పలు ప్రధాన నార్త్ అమెరికా నగరాలలో ఈ కొత్త ఫ్రాంచైజీకి స్థలం కేటాయించేందుకు టీఎన్ఎస్ పరిశీలనలో ఉంది.

ఎన్‌జెడ్‌సీ సీఈఓ స్కాట్ వీనింక్ మాట్లాడుతూ, ఈ భాగస్వామ్యం క్రికెట్ యొక్క ప్రపంచ స్థాయి మార్పుల్లో ముందంజలో నిలబెడుతుందని, ప్రపంచంలో అత్యంత లాభదాయకమైన క్రీడా మార్కెట్‌లో తమ హాజరును బలపరుస్తుందని చెప్పారు. వీనింక్ ఎంఎల్‌సీను అత్యుత్తమ స్థాయి టీ20 టోర్నమెంట్‌గా అభివర్ణించారు.




## కలియుగమ్-2064' ట్రైలర్ విడుదల


**బలగం టీవీ, హైదరాబాద్**

శ్రద్ధా శ్రీనాథ్, కిశోర్ ప్రధానపాత్రల్లో నటించిన చిత్రం 'కలియుగమ్-2064' . తమిళ, తెలుగు భాషల్లో తెరకెక్కిన ఈ చిత్రానికి ప్రమోద్ సుందర్ దర్శకత్వం వహించగా.. ఆర్.కె. ఇంటర్నేషనల్ బ్యానర్‌పై కె.ఎస్. రామకృష్ణ నిర్మించారు. మే 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ చూస్తుంటే.. 2064లో ఈ సినిమా కథ జరగబోతున్నట్లు తెలుస్తుంది. భవిష్యత్తులో మానవులు ఎలా జీవిస్తారు, ఎలా బతుకుతారు, ఎలా మరణిస్తారు అనే అంశాల చుట్టూ ఈ సినిమా తిరుగుతుంది.

## భారత్‌లో ముందుగానే విడుదల కానున్న మిషన్ ఇంపాజిబుల్


**బలగం టీవీ, హైదరాబాద్**

హాలీవుడ్ నటుడు టామ్ క్రూజ్ నటించిన 'మిషన్: ఇంపాజిబుల్ - ఫైనల్ రెకనింగ్' చిత్రం భారత అభిమానులకు గుడ్ న్యూస్ చెప్పింది. ఈ సినిమాను మొదటగా.. మే 23న విడుదల చేయనున్నట్లు ప్రకటించిన చిత్రబృందం తాజాగా విడుదల తేదీని మారుస్తూ.. ఆరు రోజుల ముందుగానే తీసుకోస్తుంది. మే 17, 2025, శనివారం థియేటర్లలోకి వస్తుందని ప్రకటించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానుల యొక్క అధిక అంచనాలు, డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పారామౌంట్ పిక్చర్స్ తెలిపింది. ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు భాషల్లో ఈ చిత్రం విడుదల కాబోతుంది. స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా రాబోతున్న అ చిత్రానికి క్రిస్టోఫర్ మేక్క్వారీ దర్శకత్వం వహించాడు.




## ఓటీటీలోకి 'మ్యాడ్ స్క్వేర్'..

**బలగం టీవీ, హైదరాబాద్**




సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత నాగవంశీ నిర్మాణంలో వచ్చిన సూపర్ హిట్ చిత్రం మ్యాడ్ స్క్వేర్ . మ్యాడ్ సినిమాకు సీక్వెల్‌గా ఈ చిత్రం రాగా.. మొదటి పార్ట్‌లో నటించిన జూనియర్ ఎన్టీఆర్ బావమరిది నార్నె నితిన్, సంతోష్ శోభన్ సోదరుడు సంగీత్ శోభన్‌తో పాటు తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రలో నటించారు. ఈ సినిమాకు కళ్యాణ్ శంకర్ దర్శకత్వం వహించగా.. నాగవంశీ నిర్మించాడు. ఏప్రిల్ 1న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్‌ను అందకుంది. ఇప్పుడు ఈ చిత్రం తాజాగా ఓటీటీలోకి అందుబాటులోకి వచ్చింది. ప్రముఖ ఓటీటీ వేదిక 'నెట్‌ఫ్లిక్స్'లో ప్రస్తుతం తెలుగుతో పాటు తమిళ్, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ సినిమా ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతుంది.

## దాదా సాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్‌కు 'క'

**బలగం టీవీ, హైదరాబాద్**




కిరణ్ అబ్బవరం నటించిన 'క' చిత్రం దాదా సాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్-2025కు నామినేట్ అయింది. బెస్ట్ ఫిలిం కేటగిరీలో ఈ సినిమా పోటీ పడుతోంది. ఈ విషయాన్ని చిత్ర బృందం తాజాగా సోషల్ మీడియా ద్వారా ప్రకటించింది. "సిల్వర్ స్క్రీన్ నుండి ప్రెస్టీజియస్ స్టేజీల వరకు.. యంగ్ టీంకి ఇది నిజమైన విజయం. 'క' రాంపేజ్ కొనసాగుతోంది" అని మేకర్స్ ఎక్స్ లో పోస్ట్ పెట్టారు. గతేడాది కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన చిత్రం 'క'. దర్శక ద్వయం సుజిత్, సందీప్ సంయుక్తంగా తెరకెక్కించిన ఈ సినిమాలో నయన్ సారిక హీరోయిన్ గా నటించింది. తన్వీ రామ్ కీలక పాత్ర పోషించింది. గతేడాది దీపావళి కానుకగా థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం మంచి విజయం సాధించింది. బాక్సాఫీస్ దగ్గర రూ.50 కోట్ల మైల్ స్టోన్ మార్క్ ను టచ్ చేసింది. న్యూ ఢిల్లీ వేదికగా మే నెలాఖరున జరగనున్న వేడుకల్లో విజేతలకు పురస్కారాలు అందించనున్నారు.